
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

శనివారం 18 అక్టోబరు 2025


అంతర వర్సిటీ మహిళా కబడ్డీ పోటీలకు బీఆర్ఏయూ జట్టు ఎంపిక

ఎచ్చెర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చెన్నైలోని వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో ఈ నెల 29 నుంచి నవంబరు 2వరకు అంతర యూనివర్సిటీ మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరపున 14 మంది క్రీడాకారిణులను నిర్వాహకులు శుక్రవారం ఎంపిక చేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్, పీడీలు డాక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.భాస్కర్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహించారు.

- వైజాగ్‌లో ఏర్పాటు చేస్తే.. సిక్కోలుకు నూతన శక్తి
- ఉద్యోగాలు, పరిశోధనలకు కొత్త దారులు
- పరిశ్రమల విస్తరణకు ఊతం
- విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు.. ట్రైనింగ్ ప్రోగ్రాంలకు అవకాశం

గూగుల్‌తో టెక్ వసంతం





శ్రీకాకుళం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో కొత్త చరిత్ర సృష్టించేందుకు గూగుల్ సిద్ధమైంది. రాష్ట్ర టెక్నాలజీ అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచే ఏఐ హబ్‌ను వైజాగ్‌లో ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టుతో ఉత్తరాంధ్ర యువతకు సాంకేతిక రంగంలో అపార అవకాశాలు లభించనున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ గూగుల్ ఆధ్వర్యంలో రూపుదిదుకునే ఈ హబ్‌లో ఏఐ ఆధారిత పరిశోధన, శిక్షణ, ఆవిష్కరణలు, స్టార్టప్ మద్దతు వంటి కార్యక్రమాలు నిర్వ హించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాదిమంది టెక్నికల్ విద్యార్థులు, ఇంజనీర్లు, పరిశోధకులు నేరుగా లాభపడతారని నిపుణులు చెబుతున్నారు.

● యువతకు అవకాశాలెన్నో..

రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు (మిగతా 8వ పేజీలో..)

● ఉత్తరాంధ్రకు గేమ్‌చేంజర్



గూగుల్ ఏఐ హబ్ ఉత్తరాంధ్రకు గేమ్‌చేంజర్ అవుతుంది. ఇది ఉద్యోగ అవకాశాలు మాత్రమే కాదు. పరిశోధన, ఆవిష్కరణలకు కూడా కొత్త దారులు తెరుస్తుంది. ప్రస్తుతం ఏఐ నిపుణుల కొరత ఉంది. ఏఐ గురించి వివరించే నిపుణులు 35 మంది అవసరం కాగా.. ఉత్తరాంధ్రలో ఒకరు మాత్రమే లభ్యమవుతున్నారు. ఏఐ హబ్ వస్తే ప్రత్యక్షంగాను.. పరోక్షంగానూ.. జిల్లా ప్రజలకు, ముఖ్యంగా యువతకు మేలు కలుగుతుంది.

- డా. బుడుమూరు రాజేష్, జేఎన్టీయూ పాలకమండలి సభ్యుడు

● అభివృద్ధికి ముందంజ



రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లా.. శ్రీకాకుళం. అత్యంత వెనుకబడిన ప్రాంతం పాతపట్నం నియోజకవర్గం. గూగుల్ ఏఐ హబ్ విశాఖలో ఏర్పాటైతే.. అనుబంధంగా శ్రీకాకుళం జిల్లా యువతకు ఎంతో ప్రయోజనం. కొన్ని సంవత్సరాల వ్యవధిలోనే వెనుకబాటు పోయి.. అభివృద్ధి పథంలోకి అన్ని ప్రాంతాలు పయనిస్తాయి. పక్కనే ఉద్యోగావకాశాలు.. అనుబంధ పరిశ్రమలు ఏర్పాటవుతాయి. ఇది శుభపరిణామం.

- మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

సంక్షేమం లేని హాస్టళ్లు

- వసతి గృహాల్లో సమస్యలు
- సొంత భవనాలు లేవు
- వార్డెన్లు, సిబ్బంది కొరత
- రెగ్యులర్ ఏఎస్‌డబ్ల్యూవో ఒక్కరే
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



చిన్న అద్దె గదిలో నిర్వహిస్తున్న తాడివలస హాస్టల్

పొందూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. సగానికి పైగా హాస్టళ్లకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో, అసౌకర్యాల నడుమ విద్యార్థులు చదువులు సాగించాల్సి వస్తోంది. సంక్షేమాధికారులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒక్కొక్క వార్డెన్ రెండు మూడేసి వసతిగృహాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఖాళీల సంఖ్య పెరిగిపోతుంది. విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు లేవు. అత్యవసర వేళ ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 22 పోస్టుమెట్రిక్, 70 ప్రీమెట్రిక్ వసతిగృహాలు నడుస్తున్నాయి. వీటిల్లో సుమారు 7వేల మంది విద్యార్థులు ఉంటున్నారు. మొత్తం 92 వసతి గృహాలకు 43 మంది సంక్షేమాధికారులు మాత్రమే ఉన్నారు. కనీసం రెండు వసతి గృహాలకు ఒక వార్డెన్ కూడా లేరు. కొందరు వార్డెన్లు రెండు నుంచి మూడు హాస్టళ్ల బాధ్యతను చూస్తున్నారు. సోంపేట, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, రణస్థలం డివిజన్ల పరిధిలోని వసతి గృహాలకు ఐదుగురు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు (ఏఎస్‌డబ్ల్యూవో) ఉండాలి. కానీ, కేవలం ఒక్క నరసన్నపేటకు మాత్రమే రెగ్యులర్ ఏఎస్‌డబ్ల్యూవో ఉన్నారు. మిగతా చోట్ల సీనియర్ వార్డెన్లకు ఎఫ్ఏసీ ఇవ్వడం జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది. ఇప్పటికే రెండు, మూడు వసతి గృహాలు చూస్తున్న వార్డెన్లకు ఏఎస్‌డబ్ల్యూవో బాధ్యతలు అప్పగించడంతో వారు తమ ఉద్యోగానికి తగిన న్యాయం చేయలేక పోతున్నారు. మిగిలిన సిబ్బంది కూడా అంతంత మాత్రమే ఉన్నారు. ప్రతీ వసతి గృహానికి కుక్, నైట్‌వాచ్‌మన్, సహాయకుడితో ముగ్గురు సిబ్బంది అవసరం. ఈ లెక్కన జిల్లాలో సుమారు 280 మంది సిబ్బంది అవసరంకాగా, కేవలం 50 మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. 150 మంది ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారు. ఇంకా సుమారు 80 మంది సిబ్బంది అవసరం. వార్డెన్లు, సిబ్బంది కొరత కారణంగా హాస్టళ్ల నిర్వహణ కష్టమవుతోంది.

సొంత భవనాలు లేవు..

జిల్లాలో 22 పోస్టుమెట్రిక్ వసతి గృహాలకు గాను కేవలం రెండు హాస్టళ్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 20 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. 70 ప్రీ మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించి 10 అద్దె భవనాల్లో, 15 ఇతర ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. 45 వసతి గృహాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో కనీస మౌలిక సౌకర్యాలు ఉండడం లేదు. ఎక్కువ మంది విద్యార్థులు ఉండేందుకు తగిన భవనాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. సరిపడ మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సివస్తోంది. రాత్రిపూట (మిగతా 8వ పేజీలో..)



ఇరుకు గదిలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న చెన్నాపురం, నడగాం రైతులు

రీసర్వేలో తప్పులను సరిచేయాలి

- నడగాం, చెన్నాపురం రైతుల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

నరసన్నపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో తప్పుల కారణంగా తాము ఇబ్బందులు పడుతున్నామని నడగాం, చెన్నాపురం గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నరసన్నపేటలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తప్పులు సరిదిద్ది తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'ఈ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు నడగాం, చెన్నాపురం గ్రామాల్లో రెవెన్యూ, సర్వేశాఖ అధికారులు భూములు రీసర్వే నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి భూములు సాగు చేస్తున్న రైతులను గుర్తించారు. చివరిస్థాయిలో గ్రామసభలు నిర్వహించకుండా, రైతులకు సమాచారం ఇవ్వకుండా రీసర్వే పూర్తయినట్టు రికార్డుల్లో నమోదు చేశారని ఆ రెండు గ్రామాలకు చెందిన రావాడ కృష్ణ, కొంక్యాన నర్సింహమూర్తి, కె.బాబ్జీ, చిట్టిబాబు, జి.ధర్మారావు, దుంపాక వెంకటరమణ, మానెమ్మ తదితర రైతులు ఆందోళన చేపట్టారు. 'బదిలీల నేపథ్యంలో సచివాలయాలకు కొత్త అధికారులు వచ్చారు. రీసర్వే పూర్తిచేయాలని ఉన్నతాధికారుల ఒత్తిడితో క్షేత్రస్థాయిలో ఉన్న రైతులను కాదని.. అడంగళ్ ప్రాప్తికి రీసర్వే రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో రీసర్వేలో రైతులు పేర్లు గల్లంతయ్యాయి. భూములు ఉన్నవారికి లేనట్టుగా.. లేనివారికి ఉన్నట్టుగా రికార్డుల్లో నమోదైంది. ఒకరి భూమి.. మరొకరి పేరుమీద ఉన్నట్టు రికార్డుల్లో చూపుతోంది. తప్పులు సరిదిద్దాలని ఎన్నిసార్లు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా.. సిబ్బంది తామేమీ చేయలేమని చెబుతున్నార'ని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ అయినా స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నడగాంలో తరతరాలుగా సాగుచేస్తున్న రైతులకు పట్టాలు లేదా పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు.

నిబంధనల మేరకు సరిచేస్తాం

చెన్నాపురం, నడగాం గ్రామాల్లోని రీసర్వేలో తప్పులు ఉంటే గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు సరిదిద్దుతామని తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీనివాసరావు రైతులకు స్పష్టం చేశారు. సాగుచేసే రైతులకు యాజమాన్య హక్కు ఇవ్వాలంటే వారసత్వం లేదా కొనుగోలు, ఏ ఇతర మార్గాల ద్వారా సంక్రయించినట్లు లిఖితపూర్వకమైన ఆధారాలు ఉండాలన్నారు. తరతరాలుగా సాగుచేస్తున్నా.. ఎటువంటి హక్కుపత్రాలు లేకపోతే యాజమాన్య హక్కులు ఇవ్వలేమని స్పష్టం చేశారు.



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ 8లో

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలకు సంబంధించి బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనసరిగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఎస్పీ కెవి.మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'బాణసంచా దుకాణాల వద్ద ఎవరూ నిద్రించరాదు. బ్యారల్స్‌లో నీటిని, అగ్నిమాపక సాధనాలను అందుబాటులో ఉంచుకోవాలి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగకుండా షాపుల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు జారీచేయాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల'ని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో శ్రీకాకుళం, టెక్కలి, పలాస ఆర్డీవోలు కె.సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



భువనేశ్వర్‌లోని కేంద్ర కారాగారం వద్ద ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న కేశవరావు తల్లి కోమలమ్మ, ప్రజాసంఘాల నాయకులు

మా కుమారుడిని విడుదల చేయాలి

- మాజీ మావోయిస్టు దున్న కేశవరావు తల్లి కోమలమ్మ విజ్ఞప్తి
- భువనేశ్వర్‌లోని కేంద్ర కారాగారం వద్ద నిరసన

పలాస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తమ కుమారుడ్ని జైలు నుంచి విడుదల చేయాలని మాజీ మావోయిస్టు దున్న కేశవరావు(ఆజాద్) తల్లి కోమలమ్మ ఒడిశా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మందస మండలం నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన కేశవరావు మావోయిస్టు పార్టీ కీలకసభ్యుడిగా, కమాండెంట్‌గా వ్యవహరించేవారు. 2011 మే 15న కేశవరావు అప్పటి డీజీపీ కె.అరవిందరావు సమక్షంలో హైదరాబాద్‌లో లొంగిపోయారు. కాగా ఒడిశా రాష్ట్రంలో దున్న కేశవరావుపై అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేశవరావును అదే నెల 29న ఒడిశా పోలీసులు విచారణకు తీసుకెళ్లారు. జూన్ 2న అరెస్టు చేసి భువనేశ్వర్ కేంద్రకారాగారానికి తరలించారు. అప్పటి నుంచి ఆయన సుమారు 15 ఏళ్లుగా జైలులోనే ఉంటున్నారు. కేశవరావు ఇటీవల తన విడుదల కోసం సుప్రీం కోర్టు, మానవహక్కుల సంఘానికి లేఖ రాశారు. సుప్రీంకోర్టు ఆయన పిటీషన్‌పై స్పందిస్తూ 2026 ఆగస్టు 31వ తేదీ నాటికి ఆయనపై ఉన్న అన్నీ కేసులపై విచారణ పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ ఏడాది సెప్టెంబరులో విచారణ ప్రారంభించాలని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చినా.. ఇంకా దీనిపై స్పందన లేదు. దీంతో కేశవరావు ఒడిశా ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఈ నెల 15 నుంచి జైలులోనే నిరాహారదీక్ష చేపడుతున్నారు. కేవలం మంచినీరు తాగి, ఇతర ఆహారాన్ని తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఈ విషయం తెలిసి.. ఆయన తల్లి దున్న కోమలమ్మ గురువారం భువనేశ్వర్‌లో కేంద్ర కారాగానికి వెళ్లారు. అక్కడ ప్రజాసంఘాలు, మానవతావాదులతో కలిసి ప్లకార్డులతో నిరసన చేపట్టారు. తమ కుమారుడ్ని విడుదల చేయాలని కోరారు. ఇటీవల ఈ విషయమై కేంద్ర, రాష్ట్రమంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే శిరీషకు కూడా విజ్ఞప్తి చేశారు.

కిడ్నీవ్యాధితో గిరిజన మహిళ మృతి



జమున (ఫైల్)

పలాస రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పలాస మండలం లొద్దభద్ర పంచాయతీ పొత్రియ గ్రామానికి చెందిన గిరిజన మహిళ సవర జమున(42) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గురువారం రాత్రి మరణించింది. జమున భర్త దేవరాజు దివ్యాంగుడు. ఈమె కూలి చేస్తూ జీవనాన్ని నెట్టుకొచ్చేది. కుమార్తెను ఇంటర్ చదివిస్తోంది. కాగా.. కిడ్నీవ్యాధితో బాధపడుతున్న ఆమె పలాసలోని ఆస్పత్రిలో చికిత్స పొందేది. ఆమె మృతి చెందడంతో భర్త, కుమార్తె బోరున విలపించారు. ఆర్థిక ఇబ్బం దులు కారణంగా మెరుగైన చికిత్స చేయించ లేకపోయామని కన్నీటిపర్యంతమయ్యారు. జమున కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు, ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు కోరారు.

లోలుగులో ఆక్రమణల తొలగింపు

● అడ్డుకునేందుకు స్థానికుల యత్నం



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

పొందూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పొందూరు మండలం లోలుగులోని చెరువుగర్భంలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈక్రమంలో ఆక్రమణదారులు, అధికారుల మధ్య వాదోపవాదనలు జరగ్గా.. స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. లోలుగు గ్రామంలో సర్వేనెంబరు 111లో 5.44 ఎకరాల్లో కూర్మగుండం చెరువు ఉంది. అందులో సుమారు 25 సెంట్లలో 17 మంది షెడ్లు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. చెరువుగర్భం ఆక్రమణపై గ్రామానికి చెందిన కొంతమంది కొన్నాళ్ల కిందట తహసీల్దార్‌తోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో 6 నెలలు కిందట పొందూరు రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో 17 మంది 25 సెంట్ల స్థలం ఆక్రమించినట్లు గుర్తించారు. ఆక్రమణలు తొలగించాలని పొందూరు తహసీల్దార్ ఆర్.వెంకటేష్ ఆ 17 మందికి రెండు నెలల కిందట నోటీసులు జారీ చేశారు. అయినా (మిగతా 8వ పేజీలో..)

సంపద వృద్ధి కోసం...

- లక్ష్మీదేవి, కుబేరుడికి పూజలు
- నేడు ధన త్రయోదశి 8లో

విజ్ఞానాన్ని పెంచేందుకు సెమినార్‌లు దోహదం

- డీఈవో రవిబాబు 9లో

ఆరు దాటితే.. చీకటే!

- వెలగని వీధి లైట్లు.. 10లో
- అంధకారంలో జంట పట్టణాలు

సంక్షేమం లేని హాస్టళ్లు

(ఏడో పేజీ తరువాయి)

వారు నిద్రించడానికి స్థలం చాలడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

కష్టంగా ఉంది..

నేను మురపాక వసతి గృహానికి రెగ్యులర్ వార్డెన్‌గా పని చేస్తున్నా. కింతలి వసతి గృహానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నా. రెండు హాస్టళ్ల నిర్వహణపై దృష్టి పెట్టడం కష్టంగా ఉంది. వార్డెన్ల పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

-బొమ్మాళి దాసు, సంక్షేమాధికారి, కింతలి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సిబ్బంది కొరత వాస్తవమే. ప్రస్తుతం 92 వసతి గృహాలు ఉండగా 77 పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. కేవలం 43 మంది వార్డెన్లు మాత్రమే ఉన్నారు. సహాయ సిబ్బంది కొరత కూడా ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం.

-అనూరాధ, డీఎస్‌డబ్ల్యూవో

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి మూడో శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'స్వాభిమాన్' పేరుతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 11 సార్లు నిర్వహించిన గ్రీవెన్స్‌లో 169 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. కొంత మంది ఉపాధి అవకాశాల కోసం అర్జీలు పెట్టారని... వారికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. ఆరోగ్య సమస్యలకు సంబంధించి జీజీహెచ్, డీసీహెచ్ఎస్ వారితో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారానికి ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. బ్యాటరీ ట్రై సైకిల్స్, ట్రై సైకిల్స్ మరమ్మతులకు గురైతే వాటి కోసం జిల్లా పరిషత్‌లో ఒక రూం కేటాయించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

పింఛను ఇప్పించండి..

శ్రీకూర్మంలోని రెడ్డిక వీధికి చెందిన కిలుగు మల్లేసు(23)కు రోడ్డు ప్రమాదంలో వెన్నెముక పూర్తిగా దెబ్బతిని ఇంటికే పరిమితమయ్యాడు. దివ్యాంగుల పింఛను ఇప్పించి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరాడు.



దివ్యాంగుల పింఛను కోసం గ్రీవెన్స్‌కు వచ్చిన కిలుగు మల్లేసు

ట్రై సైకిల్ ఇచ్చారు..

సరుబుజ్జిలి మండలం మూల సవళాపురం గ్రామానికి చెందిన పి.అప్పలనర్సమ్మ ఎవరూ లేని దివ్యాంగురాలు. తన గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆమెను గ్రీవెన్స్‌కు తీసుకువచ్చారు. రెండు చేతులతో ఆమెను ఎత్తుకుని అతికష్టం మీద కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. తనకు ట్రైసైకిల్ ఇప్పించాలని ఆమె విన్నవించుకుంది. తక్షణమే స్పందించిన కలెక్టర్ ఆమెకు కొత్త ట్రై సైకిల్‌ను అందజేశారు. దీంతో ఆ దివ్యాంగురాలు ఆనందం వ్యక్తం చేసింది.

బ్యాటరీ సైకిల్ ఇప్పించండి..

గార మండలం పూసర్లపాడు గ్రామానికి చెందిన పల్లా అప్పారావు దివ్యాంగుడు. చిన్నతనంలోనే పోలియో బారిన పడ్డాడు. ఎక్కడికి వెళ్లాలన్నా సరే ఇబ్బందికర పరిస్థితి. తనకు బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ ఇప్పిస్తే ఎవరిపైనా ఆధారపడకుండా తన పనులు తాను చేసుకోగలుగుతానని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ అతి త్వరలోనే బ్యాటరీ సైకిల్ ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు.

'గూగుల్'తో టెక్ వసంతం

(ఏడో పేజీ తరువాయి)

కోసం అన్ని విధాలా సహకరిస్తోంది. విశాఖలోని ఐటీ హిల్స్ ప్రాంతంలో ఏఐ హబ్ కోసం అవసరమైన భూమి, మౌలిక వసతుల కల్పనకు చర్యలు మొదలయ్యాయి. గూగుల్ ప్రతినిధులు ఇటీవల సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో సమావేశమై ప్రాజెక్టు దిశపై చర్చించారు. వైజాగ్‌లో ఏర్పడనున్న ఈ టెక్ హబ్.. పక్క నే ఉన్న శ్రీకాకుళం జిల్లాకు నూతన శక్తి ఇవ్వనుంది. ఇప్పటివరకు ఐటీ ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్లిన ఉత్తరాంధ్ర యువత ఇప్పుడు వైజాగ్‌లోనే టెక్నాలజీ ఆధారిత కెరీర్ సాధించే అవకాశం ఉంది. శ్రీకాకుళం, టెక్కలి, ఎచ్చెర్ల, ఆమదాలవలస ప్రాంతాల్లో ఇంజనీరింగ్ కళాశాలలు, పాలిటెక్నికల్ విద్యార్థులు.. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, ట్రైనింగ్ ప్రోగ్రాంలు చేయడానికి నేరుగా అవకాశం ఉంటుంది. విశాఖ-శ్రీకాకుళం-విజయనగరం జిల్లాలు టెక్ కారిడార్‌గా మారే అవకాశం ఉంది. కొత్త స్టార్టప్‌లు, డేటా సర్వీసులు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, చిన్న పరిశ్రమలు ఈ ప్రాంతంలో విస్తరించనున్నాయి. ఇది ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన బలంగా నిలవనుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

లోలుగులో ఆక్రమణల తొలగింపు

(ఏడో పేజీ తరువాయి)

ఇప్పటివరకూ స్పందన లేకపోవడంతో పోలీసుల సమక్షంలో ఆక్రమణలు తొలగించారు. కాగా తాము 15 ఏళ్ల కిందట ఈ స్థలాలను కొనుగోలు చేశామని, నిర్మాణాలు ఎలా తొలగిస్తారంటూ స్థానికులు అధికారులను నిలదీశారు. ఆక్రమణల తొలగింపును అడ్డుకునేందుకు యత్నించారు. చెరువు గర్భాల్లో చాలా అక్రమ నిర్మాణాలు జరిగాయని, వాటన్నింటినీ తొలగిస్తారా? అని ప్రశ్నించారు. అధికారులు, స్థానికుల మధ్య వాదోపవాదనలు చోటుచేసుకున్నాయి. తమ విధులకు అడ్డుపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటేష్, సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఎస్సైలు సత్యనారాయణ, బాలరాజు, సర్వేయర్ గణపతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంపద వృద్ధి కోసం..

- లక్ష్మీదేవి, కుబేరుడికి ప్రత్యేక పూజలు
- ఆరోగ్యం కోసం ధన్వంతరికి..
- నేడు ధన త్రయోదశి
- మార్వాడీలకు ఎంతో ప్రత్యేకం



మార్వాడీల ఇంట్లో పూజా మందిరాన్ని అలంకరించిన దృశ్యం

నరసన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి)

ధన త్రయోదశి.. దీపావళికి రెండు రోజుల ముందు వచ్చే పండుగ. దీనిని మరాఠీలో ...ధన్ తేరాస్ అంటారు. మార్వాడీలు ఈ పండుగను సందడిగా చేసుకుంటారు. జిల్లాలో నరసన్నపేట, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, టెక్కలి, సోంపేట, ఆమదాలవలస తదితర పట్టణాల్లో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన మర్వాడీలు వివిధ వ్యాపారాలు చేస్తూ నివశిస్తున్నారు. వీరు ధన త్రయోదశిని ఘనంగా నిర్వహిస్తుంటారు. ఆ రోజున కొత్త బంగారు వస్తువులు కొనుగోలు చేస్తారు. ఇటీవల కాలంలో ఇతర వర్గాలూ ఈ పండుగను నిర్వహిస్తున్నాయి. ఆ రోజున కొందరు బంగారు ఆభరణాలను.. మరికొందరు నూతన వాహనాలను కొనుగోలు చేస్తుంటారు.

అకాల మరణం రాకుండా..

శాస్త్ర ప్రకారం ధన త్రయోదశి పండుగను అకాల మరణ భయాన్ని పోగొట్టడానికి యమధర్మరాజును ప్రార్థించే రోజుగా చెబుతారు. సంపదలకు అధిదేవత అయిన లక్ష్మీదేవిని, కుబేరుడిని పూజిస్తారు. అంతేకాకుండా వైద్యసేవలకు మూలపురుషుడైన ధన్వంతరి జయంతిని కూడా నిర్వహిస్తారు. దీపావళిని మార్వాడీలు ఐదు రోజుల పండుగగా నిర్వహిస్తారు.

మొదటి రోజు.. వసూబారాస్

వసూ బారాస్ పేరుతో మార్వడీలు ఆవు, దూడలకు తొలిరోజు పూజిస్తారు. ద్వాదశి రోజున తెల్లవారి లేచి.. సుంగంధ నూనెలను శరీరానికి పూస్తారు. ఆ తరువాత తలంటు స్నానాలు చేస్తారు. ఆరోజు మధ్యాహ్నం వరకు ఉపవాసం ఉంటారు. కుటుంబ సభ్యులందరూ కలిసి ఆవు, దూడలకు పసుపు, కుంకుమలతో అలంకరించి పూజలు చేస్తారు. ఇంట్లో చేసిన నైవేద్యాన్ని వాటికి ఆహారంగా పెడతారు. ఆ తరువాత ఉపవాసాన్ని విరమిస్తారు.



ధనత్రయోదశి పూజలు చేస్తున్న మార్వాడీ కుటుంబీకులు (ఫైల్)

రెండో రోజు ..

ధన్ తేరాస్.. తెలుగులో ధన త్రయోదశి. ఆ రోజు ఇళ్లను ఆవుమూత్రం కలిపిన నీటితో శుభ్రం చేస్తారు. సాయంత్రం సూర్యాస్తమయ సమయంలో లక్ష్మీదేవి, కుబేరుడు, ధన్వంతరిలకు పూజలు చేస్తారు. మహిళలు బంగారు ఆభరణాలు ధరిస్తారు. ఇంటికి దక్షిణ భాగంలో నెయ్యి లేదా నువ్వుల నూనె దీపం వెలిగిస్తారు. ఇది యమధర్మరాజును సంతోషపెట్టేందుకని వారి నమ్మకం. ఆరోజు ప్రదోష కాలంలో గణేశుడు, లక్ష్మీదేవి, కుబేరులను పూజిస్తారు. 13 దీపాలను వెలిగించి.. కుబేరునికి మంత్రాలతో ధ్యానిస్తారు.

మూడో రోజు దీపావళి..

మూడో రోజు సూర్యాస్తమయం తరువాత ప్రదోష కాలంలో ఇంట్లో గణేశుడు, లక్ష్మీదేవిల ప్రతిమలు ఏర్పాటు చేసి.. ప్రత్యేకంగా మామిడి తోరణాలతో అలంకరిస్తారు. లక్ష్మీదేవిని బంగారు ఆభరణాలు, వెండి రూపాయలతో అలంకరించి.. వివిద రకాల పిండివంటలు నేవేద్యంగా సమర్పించి..పూజలు చేస్తారు. ఆ తరువాత దీపాలు వెలిగించి.. బాణసంచాతో సందడిగా పండుగ చేసుకుంటారు.

నాలుగో రోజు పడ్వా దీపావళి..

నాలుగో రోజున కుటుంబ యజమాని భార్య తన భర్తకు పూజా మందిరంలో హారతి ఇస్తుంది. దీనికి ప్రతిగా భర్త తన భార్యకు బహుమతి ఇస్తాడు. ఇల్లాలు చేసే ఈ పూజలతో మహా విష్ణువు అనుగ్రహం లభిస్తుందని.. భార్యాభర్తల మధ్య అనురాగం పెరుగుతుందని నమ్మకం.

ఐదో రోజు ..

కార్తీకమాసంలో భగినీహస్త భోజనం రోజున మర్వాడీలు బహుబజీ పేరుతో పండుగ జరుపుకుంటారు. సోదరుడికి సోదరి రక్ష కట్టి హారతి ఇస్తుంది. సోదరి ఇంట్లో భోజనం చేసి.. ఆమెకు కానుక ఇస్తాడు. సోదరీ సోదరుల బంధం మరింత బలపడేందుకు ఈ పండుగ నిర్వహిస్తారు. ఈ ఐదు రోజులూ సూర్యాస్తమయ సమయంలో ఇంటి బయట దీపాలు వెలిగిస్తారు. కొందరు సంపన్నులు ఈ పండుగను పదిహేను రోజుల వరకు నిర్వహిస్తారు.

పదిహేను రోజుల ముందుగానే...



ధన త్రయోదశి ముందు పదిహేను రోజుల నుంచి పిండివంటలు చేస్తాం. ఎన్నో రకాల స్వీట్లు తయారు చేసి.. దేవుడికి ప్రసాదంగా పెడతాం. ఇక త్రయోదశి ముందు రోజు నుంచి సందడి ప్రారంభిస్తాం. ఇక్కడ కొన్ని కుటుంబాలు ఉంటాయి. కలిసి చేసుకుంటాం. అదే మా గ్రామాల్లో ఎవరికి వారు పండుగను ఘనంగా నిర్వహిస్తారు.

-నానాజీ గాడ్డే, నరసన్నపేట

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

సందేశాత్మకం



జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.



అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్ధంలో ప్రేమకథ, ద్వితీయార్ధంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.



కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారిణులు

ఆకట్టుకున్న నృత్యాభినయం

అరసవల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌పై అవగాహన వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఎన్టీఆర్ మునిసిపల్ మైదానంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం బెండి మాధురి బృందం సభ్యులు ప్రదర్శించిన కోలాటం, కుమారి శ్రీలత బృందం, నాట్యశ్రీ కళా నికేతన్, శ్రీకాకుళానికి చెందిన కళాకారులు అంబ ప్రార్థన, నర్తన గణపతి, శివతాండవం, వచ్చెను అలమేలు మంగ, గరుడ గమన, మధురాష్టకం, ఒకపరి, అయిగిరి నందిని, మరకత మణిమయ తరంగం, చందన చర్చిత తదితర గీతాలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారులను నిర్వాహకులు సత్కరించి అభినందించారు.



నాట్యశ్రీ నృత్యనికేతన్ బృందం ప్రదర్శన

గురుకుల హాస్టళ్ల పనులు వేగవంతం చేయండి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల హాస్టళ్ల పనులను వేగవంతం చేసి, పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా చేపడుతున్న పనుల ప్రగతిపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుప్పలవలస, పెద్దపాడు, ఆమదాలవలస తామరాపల్లి హాస్టళ్లలో చేపడుతున్న వివిధ పనుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. కొల్లివలసలో మోడరన్ కిచెన్, పలాసలో మరమ్మతులు, నందిగాం హాస్టల్ గదుల నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యతలో రాజీ ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమా వేశంలో ఈఈ బి.రామకృష్ణ, డీఈఈ బి.శ్రీరాములు, జిల్లా కోఆర్డినేటర్ యశోదలక్ష్మి పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 30 మంది ఎంపిక


క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

ఎచ్చెర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో రెనాల్ట్ నిస్సాన్ ఆటోమెటివ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (చెన్నై) శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణమూర్తినాయుడు తెలిపారు. రాత, కమ్యూనికేషన్, టెక్నికల్ టెస్టులు, మౌఖిక ఇంటర్వ్యూ హెచ్ఆర్ మేనేజర్ ఎం.ప్రకాష్, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ జి.శ్రీనిధి నిర్వహించి ఎంపికలు చేశారన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి, ఇప్పిలి కిశోర్, బెండి కార్తీక్ తదితరులు అభినందించారు.

పీఎం ఉషా నిధులతో వర్సిటీ అభివృద్ధి: వీసీ

ఎచ్చెర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (పీఎం ఉషా) నిధులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీని అభివృద్ధి చేయనున్నామని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. ఈ పథకంపై శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని, కేంద్ర విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి ఆర్మ్‌స్ట్రాంగ్ పామ్ (న్యూఢిల్లీ) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 2025-26కి సంబంధించి ఒకటి, రెండు విడతల్లో విడుదలైన నిధులు ఎలా వెచ్చిస్తున్నారన్న అంశంపై చర్చించారన్నారు. పరిపాలనా భవనం, విద్యార్థినుల హాస్టల్, ఇంజనీరింగ్ కళాశాలకు ప్రత్యేక వర్క్‌షాపు షెడ్, ప్రహరీ, మెయిన్ గేటు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి అవసరమైన పరికరాలు కొనుగోలు చేస్తామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, పీఎం ఉషా వర్సిటీ కోఆర్డినేటర్ టి.సంతోష పావని, ఇంజనీర్లు పాల్గొన్నారు.

గంజాయిపై చర్యలు తీసుకోండి

ఇచ్ఛాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకువచ్చి దుకాణాలు, ఫుడ్ సెంటర్లు, కిరాణా షాపులు, దాబాల్లో విక్రయిస్తున్నారని, తక్షణం దాడులు చేసి చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఐ మీసాల చిన్నమనాయుడును కలిసి వినతిపత్రం అందించారు. గంజాయిని విక్రయిస్తూ యువతను చెడు వ్యసనాలకు బానిసలను చేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణం బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రోకల్ల భాస్కరరావు, చీకటి కృష్ణయ్య, నాగేష్, బాలకృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కంచిలి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గత ఏడాది ఇచ్చిన హామీలు నెరవేర్చేంత వరకూ పోరాటం ఆగదని సీఏఎస్ఎం డాక్టర్ టి. హరిబాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కంచిలి, ఎంఎస్ పల్లి పీహెచ్‌సీల వద్ద వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. 13 రోజులుగా వైద్యులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బాణసంచాలతో జాగ్రత్తగా ఉండాలి

కంచిలి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి వేళ బాణ సంచాలతో అప్రమత్తంగా ఉండాలని సోంపేట ఫైర్ అధికారి సూర్యారావు అన్నారు. శుక్రవారం బూరగాం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు సంభంఇంచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

సరుబుజ్జిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సీపీఆర్, ప్రథమ చికిత్సలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో రోగికి తక్షణమే అందించాల్సిన సీపీఆర్ విధానంపై వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది డి.మోహనరావు, సూపర్‌వైజర్ లక్ష్మీబాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు, అధ్యాపకుడు గొండు శ్రీనివా సరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారం

ఆమదాలవలస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావేదిక దోహదం చేస్తుందని రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బొనెల అప్పారావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు వినతులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూన ఆంజనేయులు, పీవీకే రాజు, నాగళ్ల మురళీధర్‌యాదవ్, తోట రాము, జి.రమణ మూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీగా షేక్ భాషా

ఎచ్చెర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రభుత్వ ఖాజీగా షేక్ భాషాను నియమిస్తూ మైనార్టీ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జి. సిగడాం మండలం మెట్టవలసకి చెందిన షేక్ భాషాను నియమించారు. పదేళ్ల పదవీ కాలంలో ముస్లిం సమాజానికి చెందిన వివాహా లను మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. ఈయన సంతబొమ్మాళి మండలం శ్రీకృష్ణాపురం మసీదులో ఇమామ్‌గా సేవలందిస్తున్నారు. పదవీకాలం పూర్తయిన తర్వాత వివాహ రికార్డులను వక్ఫ్ బోర్డుకు అప్పగించాలని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి.శ్రీధర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సూర్యఘర్‌పై ప్రత్యేక కౌంటర్లు

గుజరాతీపేట/పాతశ్రీకాకుళం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గృహాలపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల, ఆమదావలస, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. తగ్గిన జీఎస్టీ ధరలతో సోలార్ రూఫ్ టాప్ పరికరాలు ధరలు తగ్గాయని వినియోగించుకోవాలని కోరారు.

గ్లోబల్ పిన్టిక్ ఫెస్ట్ విజేతకు అభినందన


సుమిత్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

కవిటి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి గ్లోబల్ పిన్టిక్ ఫెస్ట్-2025 విజేతగా నిలిచిన బెలగాం గ్రామానికి చెందిన ఆర్.సుమిత్ కుమార్‌ను శుక్రవారం శ్రీచింతామణి సొండికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సత్కరించి అభినందించారు. సుమిత్‌కుమార్ ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన పోటీల్లో ప్రతిభ కన బరిచి మహారాష్ట్ర సీఎం చేతులమీదుగా బహుమతి పొంది ఈ ప్రాంతానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్య క్రమంలో సంఘ ప్రతినిధులు ఎం.నాగేశ్వరరావు, పి.చంద్రశేఖర్, ఎం.సీతారాం, ప్రశాంత్, విద్యార్థి తల్లిదండ్రులు కామేశ్వరరావు, ప్రమీల పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి

● ఎస్ఎస్ఏ ఏపీసీ శశిభూషణ్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నియంత్రించాలని సర్వశిక్షా అభియాన్ ఏపీసీ శశిభూషణ్ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ప్రధాన మార్గాల్లో విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ ఐ.విమల మాట్లాడుతూ జిల్లాలో బాలికా సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సూర్యమహల్ కూడలి వద్ద మానవహారం నిర్వ హించారు. బాలికల రక్షణకు మద్దతుగా పాల్గొన్న వారితో సంతకాల సేకరణ చేపట్టారు. విద్యార్థి నులకు వ్యాసరచన, డ్రాయింగ్, సాంస్కృతిక పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, బాలల రక్షణ అధికారి కేవీ రమణ, మిషన్ కోఆర్డినేటర్ డి.ఉమామహేశ్వరి, నోడల్ అధికారి కె.మణెమ్మ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

రైతులకు సాగునీరందేలా చర్యలు

జి.సిగడాం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరందేలా చర్యలు తీసుకోను న్నట్లు ఎమ్మెల్సీ నాగబాబు అన్నారు. దేవరవలస గ్రామ సమీపంలో మద్దువలస కుడి ప్రధాన కాలువను శుక్రవారం పరిశీలించారు. 70 అడుగుల లోతులో కాలువ ఉండటంతో సాగునీరు అందడం లేదని గ్రామ పెద్దలు, రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పూర్తిస్థాయిలో కాలువను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటా నన్నారు. ఆయన వెంట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి విశ్వక్సేన్, ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి తాలాబత్తుల పైడిరాజు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, మీసాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం సందర్శన

లావేరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): లావేరు సమీపంలో నిర్మిస్తున్న జనసేన ప్రాంతీయ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ కె. నాగబాబు శుక్రవారం పరిశీలించారు. త్వరలో కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు, జనసేన కార్యకర్తలకు అందుబాటులో ఉంచతామన్నారు. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లావేరు: కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

విజ్ఞానాన్ని పెంచేందుకు సెమినార్‌లు దోహదం

గుజరాతీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు సైన్స్ సెమినార్‌లు దోహదం చేస్తాయని డీఈవో ఎ.రవిబాబు అన్నారు. నగరం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి సైన్స్ సెమినార్, పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. విద్యార్థులు తయారుచేసిన పలు ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. ఇక్కడ విజేతలు ఈనెల 18న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ కూడా ప్రతిభ కనబరచాలన్నారు. విజేతలకు బహుమతులను అందించి అభినందించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధి కారి ఆర్.విజయకుమారి, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.కుమార్‌స్వామి, హెచ్‌ఎంలు పి.సతీష్‌కుమార్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న విద్యాశాఖాధికారులు

వయోవృద్ధులకు తోడుగా..

శ్రీకాకుళం లీగల్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులు ఆదర్శప్రాయులని, వారికి ఎల్లవేళలా తోడుగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉంటుందని, ఆ సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. కలెక్టర్ ఆఫీస్ సమీపంలోని రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న శాంతాఅనురాగ నిలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న తలసేమియా వ్యాధి గ్రస్తులను, వృద్ధులను కలిసి వారికి అందిస్తున్న సేవలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తలసేమియా వ్యాధి గ్రస్తులకు నెలవారీ రక్తమార్పిడిలో ఎటువంటి అలసత్వం ఉండకూడదన్నారు. వృద్ధులకు ఎటువంటి సమస్యలు వచ్చినా పరిష్కంచేందుకు జిల్లాన్యాయ సేవాధికార సంస్థ ముందు ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


తలసేమియా వ్యాధిగ్రస్థులను పరామర్శిస్తున్న న్యాయాధికారి కె.హరిబాబు

వీధి వ్యాపారులకు తోడ్పాటు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారుల ఆర్థిక తోడ్పాటు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని మెప్మా పీడీ ఎస్. వెంకటరావు అన్నారు. పీఎం స్వానిధిపై శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డుల మంజూరు, రుణ సౌకర్యంతో పాటు, కొత్తగా క్రెడిట్ కార్డు పాలసీ కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు మేనేజర్ ఎం.నారాయణ, సీఎంఎం జి.కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'పీఎం స్వానిధి'పై అవగాహన

ఆమదాలవలస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో ప్రధాన మంత్రి స్వానిధి పథకంపై స్వయం సహాయక సంఘాల మహిళలకు, వీధి వ్యాపారులకు కమిషనర్ తమ్మినేని రవి ఆధ్వ ర్యంలో అవగాహన కల్పించారు. ఈ పథకం కింద వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను విస్తృతం చేసుకో వచ్చన్నారు. రుణాలను సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా వడ్డీ సబ్సిడీ, క్రెడిట్ లిమిట్ పెంపు ప్రయో జనాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ నరేష్‌కుమార్, మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నం, సీవో నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి శబ్దాలుంటే చర్యలు

పొందూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి డీజే బాక్సుల శబ్దాలు పెడితే నిర్వాహ కులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వి.సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం స్టేషన్‌లో డీజే బాక్సు ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల డీజే బాక్సుల మూలంగా చోటు చేసుకుంటున్న అనర్థాలపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం 'డీజే అలజడి' శీర్షికతో వచ్చిన కథనానికి ఎస్పీ స్పందించారు. ఆయ న ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. పరిమితికి లోబడి సౌండ్ పెట్టాలని, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో డీజే సౌండ్‌ను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు.

హోం కంపోస్టుపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హోం కంపోస్టు తయారీ విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ సంస్థల ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్లు, మెప్మా సిబ్బందికి శుక్రవారం వివిధ అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. తడిచెత్తను ఇంటి వద్ద ఎరువుగా మార్చి మిద్దె పంటలకు ఉపయోగించు కోవచ్చన్నారు. శిక్షకులు వెంక టేశ్వరరావు, కమలేషు, నాయక్ ఆయా అంశాలపై శిక్షణ ఇచ్చారు.

జీఎస్టీ 2.0తో తగ్గిన ధరలు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):నిత్యావసర వస్తువులు, మందులు, కార్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు తదితర రకాల వస్తువులపై జీఎస్టీ 2.0తో భారీగా ధరలు తగ్గాయని జీఎస్టీ నోడల్ అధికారి స్వప్న దేవి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో జరుగుతున్న జీఎస్టీ 2.0 ఎగ్జిబిషన్, సేల్స్ జరుగుతోందన్నారు. కొనుగోళ్లపై లక్కీ కూపన్లు ఇస్తున్నామని, 19న డ్రా తీసి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. వీటిని వినియోగించుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

సీజేపై దాడికి యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

గార, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు కురమాన అశోక్ మాదిగ తదితరులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కంటిపాక హేమశేఖర్, నాయకులు కురమాన రమణ, సింహాచలం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గార, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33 కేవీ చల్లపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మర మ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చల్లపేట, శ్రీకూర్మం, వాడాడ, తండ్యాలపేట, ఒప్పంగి పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

సరుబుజ్జిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని అధిక దిగుబడులను సాధించాలని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం షలంత్రి, విజయరాంపురం గ్రామాల్లో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో భాగంగా రైతులకు అవగాహన, శిక్షణను జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు వ్యవసాయాధికారి రేణుక, సాయి, కె. మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.


ఆరు దాటితే.. చీకటే!

- వెలగని వీధి లైట్లు
- అంధకారంలో జంట పట్టణాలు
- పట్టించుకోని యంత్రాంగం

కాశీబుగ్గ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాల్టీగా మారిన తరువాత సెంటర్ డివైడర్లను ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహణ బాగుండేది. తర్వాత అధికారంలో వచ్చిన వైసీపీ గాలికి వదిలేసింది. దీంతో జంట పట్టణాలు సాయంత్రం 6 గంటలు దాటితే చాలు అంధకారం లోకి వెళ్లిపోతున్నాయి. కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ నుంచి పలాస వరకూ కిలో మీటరుకుపైగా సెంటర్ డివైడర్‌లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. అందులో కొన్ని స్తంభాలు పాడయ్యాయి. ఉన్న వాటికి సైతం లైట్లు వెలగడం లేదు. దీంతో సాయంత్రం 6 గంటలు దాటితే జంట పట్టణాలు చీకటిమయంగా మారుతున్నాయి. పలాస- కాశీ బుగ్గ మునిసిపాల్టీలో 31 వార్డుల్లో మొత్తం 4,500 విద్యుత్ దీపాలు ఉన్నాయి. వీటి నిర్వహణకు ఉన్న సిబ్బంది కేవలం నలుగురే. దీంతో వీధి దీపాల ఏర్పాటు, మరమ్మతులు, పర్యవేక్షణ ఇబ్బందిక రంగా మారుతోంది. ఇంత పెద్ద మునిసిపాల్టీలో విద్యుత్ లైట్లు మార్చేందుకు హైడ్రా కూడా లేదు. దీంతో ప్రతి స్తంభం ఎక్కాల్సిన పరిస్థితి. దీంతో పునరుద్ధరణ, లైట్ల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. విద్యుత్ శాఖ సైతం ఈ విష యంలో చేతు లెత్తేస్తోం ది. దీని పై మునిసిపల్ యం త్రాంగంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని నెలలు నుంచి విద్యుత్ లైట్లు వెలగకపోయినా మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రిపూట బయటకు వచ్చేందుకు పట్టణ ప్రజలు భయపడు తున్నారు. ముఖ్యంగా కుక్కల దాడులు తరచూ జరుగు తున్నాయి ఆందోళన చెందుతున్నారు.


వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగని దుస్థితి


వెలగని సెంట్రల్ లైటింగ్


వెలుగుతున్న లైట్లు

ఆరు నెలలుగా వెలుగుతూ..

- పట్టపగలే విద్యుత్ కాంతులు
- సిబ్బంది నిర్లక్ష్యంతో అదనపు భారం
- ఇదీ పలాస మునిసిపాలిటీలో పరిస్థితి



పలాస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వేయండి మొర్రో అన్నా పట్టించుకోరు.. మరికొన్ని చోట్ల నిత్యం విద్యుత్ దీపాలు వెలుగుతున్నా పట్టించుకోరు.. ఇదీ పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో పరిస్థితి. స్థానిక వివేకానంద మార్గ్ (అప్పయ్యదొర రోడ్)లో ఆరు నెలలుగా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. పగలు ఆపండని స్థానికులు ఆ శాఖ సిబ్బందిని కోరుతున్నా పట్టించుకోవడంలేని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. ఇలా నిర్లక్ష్యంగా వదిలేస్తే ఎందుకు మునిసిపాలిటీకి రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు రావని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

కోటబొమ్మాళిలోనూ వెలుగులే..

కోటబొమ్మాళి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన సెంటర్ విద్యుత్ లైటింగ్ పగటి పూట కూడా వెలుగుతునూ కనిపిస్తున్నాయి. ఎంతో విలువైన విద్యుత్ వృథా అవుతుందని స్థానికులు వాపోతున్నారు. వీధి దీపాల ఆన్, ఆఫ్ విష యంలో విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలు వురు విమ ర్శిస్తున్నారు. చాలా గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. పంచాయతీ ఆదాయం, జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా రాత్రిపూట ఆన్‌చేసి ఉదయం పూట ఆఫ్ చేయాలి, కాని అలా జరగడం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు వేల రూపాయలు బిల్లులు వస్తున్నాయి. సంబంధిత అధి కారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పడవ బోల్తా.. సీమన్ గల్లంతు

- మొజాంబిక్ దేశ సముద్ర జలాల్లో ఘటన


గల్లంతైన తారకేశ్వరరావు

గార, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మొజాంబిక్ దేశ సముద్ర జలాల్లో సర్వీస్ పడవ బోల్తాపడిన ఘటనలో మండలంలోని కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన సీమన్ మైలపల్లి తారకేశ్వరరావు(52) గల్లంతైనట్టు సమాచారం వచ్చిందని ఆయన బంధువు బొంది రాము తెలిపారు. రాము తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 12వ తేదీన తారకేశ్వరరావు కె.మత్స్యలేశం నుంచి షిప్‌లో విధుల కోసం బయలుదేరి వెళ్లారు. గురువారం ఉదయం 10 గంటలకు సముద్రంలోని షిప్‌లో డ్యూటీకి బోటుపై వెళ్తుండగా అది బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురు గల్లంతైనారని, వారిలో తారకేశ్వరరావు ఉన్నట్టు ముంబాయి నుంచి సంబంధిత కంపెనీ ప్రతినిధుల నుంచి ఫోన్ ద్వారా సమాచారం వచ్చింది. తారకేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సర్వీస్ పడవ బోల్తా పడిన ప్రదేశంలో గాలింపు చర్యలు చేపడుతున్నట్టు సమాచారం ఇచ్చినట్టు రాము తెలిపారు.

హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ మృతి


సింహాద్రినాయుడు(ఫైల్)

కోటబొమ్మాళి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం పంచాయతీ మాజీ సర్పంచ్ హనుమంతు సింహాద్రినాయుడు (85) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. అతడి స్వగ్రామం వింజాంపాడులో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భార్య ఇప్పటికే మృతిచెందగా, ముగ్గురు కుమారులు హనుమంతు శేషగిరి, సుబ్రహ్మణ్యం, తేజేశ్వరరావు ఉన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సర్పంచ్ గురువిల్లి కేశవరావు, మాజీ సర్పంచ్ పూజారి శైలజ, గ్రామ పెద్దలు పూజారి సత్యనారాయణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సకాలంలో ఫిర్యాదులను పరిష్కరిస్తాం


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సంబంధిత తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో శుక్రవారం ప్రజాల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిశీలించి సత్వర మే పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. అర్జిదారులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. పౌరసంబంధాలు, కుటుంబ, ఆస్తి గొడవలు, మోస పూరితమైన వ్యవహారాలపై ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించాడు

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి యువతిని మోసగించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు శ్రీకాకుళం రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. విశాఖ జిల్లా పరవాడ మండలానికి చెందిన ఓ యువతి శ్రీకాకుళం నగరంలో తన పెద్దమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుటుంది. ఇంటర్ చదువుతున్న సమయంలో ఆమదాలవలస పట్టణానికి చెందిన మెట్ట శరత్‌చంద్రతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించాడు. ఆ తర్వాత పెళ్లి విషయం ప్రస్తావన తీసుకురాగా మొహం చాటేస్తుండడంతో పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగింది. అయినా ఫలితం లేకపోవడంతో తాను మోసపోయానని గుర్తించి శరత్‌చంద్రపై ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శరత్ చంద్రపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. కాగా శరత్‌చంద్ర సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా పనిచేస్తున్నాడు.

ఆటో ఢీకొని ఇరువురికి గాయాలు

జలుమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నామాలపేట వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సరుబుజ్జిలి మండలం మాల సవలాపురం గ్రామానికి చెందిన భార్య, భర్తలు జె.సీతారత్నం, రామారావు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి గ్రామానికి చెందిన జె.రామారావు, సీతారత్నం స్కూటీపై నరసన్నపేట వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా నామానపేట వద్ద వెనుక నుంచి వచ్చిన ఆటో ఓవర్‌టేక్ చేసే క్రమంలో స్కూటీని ఢీకొట్టడంతో వారిద్దరూ గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సీతారత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు.

ప్రమాదవశాత్తు జారిపడిన క్రీడాకారిణికి..

ఎచ్చెర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని ఓ విద్యా సంస్థలో శుక్రవారం నిర్వహించిన క్రీడా ఎంపికలకు హాజరైన ఓ క్రీడాకారిణి ప్రమాదవశాత్తు జారి పడి గాయపడింది. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన విద్యార్థిని క్రీడా ఎంపికలో పాల్గొనేందుకు హాజరైంది. దుస్తులు మార్చుకునేందుకు సమీపంలోని ఓ భవనంపైకి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి గాయపడింది. వెంటనే ఆమెను అంబులెన్స్‌లో శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

వలలు దగ్ధం

రణస్థలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడ గ్రామస్థుడు బడి తాతకు సంబంధించి చేపల వేటకు అవసరమైన వలలు శుక్రవారం ఉదయం దగ్ధమయ్యాయి. పురిపాకలో భద్ర పరిచిన వలలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని బాధితుడు విలపిస్తున్నాడు. వీటి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని ఆయన తెలిపాడు. ఘటనా స్థలానికి ఎస్ఐ ఎస్.చిరంజీవి, తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ వెళ్లి పరిశీలించారు.

షిర్డీసాయి మందిరంలో చోరీ

పాతపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలాంధ్ర రోడ్‌లోని షిర్డీ సాయి మందిరంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలయ కమిటీ ప్రతినిధి టి.తారకేశ్వరరావు శుక్రవారం ఉదయం మందిరానికి వెళ్లేసరికి వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉండడం తో చోరీ జరిగినట్టు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ ఎన్.సన్యాసినాయుడు, ఎస్ఐ కె.మధుసూధనరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి క్లూస్‌టీం చేరుకుని ఆధారాలు సేకరించారు. మందిర ప్రధాన ద్వారం బలంగా ఉండడంతో వెంటిలేషన్‌ను పగలుగొట్టి దొంగలు ప్రవేశించి చోరీకు పాల్ప డ్డారు. ఈ చోరీలో స్వామివారికి హారతులిచ్చే సుమారు అర కిలో బరువు గల వెండి పళ్లెం, అన్నదానం కోసం ఉంచిన సుమారు రూ.22 వేలు నగదు చోరీ జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బొందిలీపురంలో..

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని బొందిలీపురం ఓ ఇంటిలో చోరీ కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొందిలీపురం బాయమ్మతోటకు చెందిన సంపతి పురుషోత్తం ఈ నెల 8న విశాఖలోని తన బావమరిది కుమార్తె వివాహానికి భార్యతో కలిసి వెళ్లారు. శుక్రవారం ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉండడాన్ని అదే ఇంటి మేడపైన అద్దెకు ఉంటున్న వ్యక్తి గమనించి అతడికి సమాచారం ఇచ్చారు. వెంటనే అతను ఇంటికి చేరుకుని చూసేసరికి ఇంటి బీరువా తాళాలు పగులకొట్టి ఉండడంతో పాటు 300 గ్రాములు వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీంతో ఆయన టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ ఈశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు సీఐ తెలిపారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

- పరామర్శించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల కిందట భవానీపురంలో పురాతన భవనం పోర్టికో కూలిన ఘటనలో తీవ్రంగా గాయపడిన అడగప్రోలు రాధ, అమృత, సోనీలను గురువారం రాత్రి కేజీహెచ్‌కు తరలించి మెరుగైన వైద్యం అందజేస్తున్నారు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితలను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరామర్శించారు. బాధితులు కోలుకునేవరకు ప్రభుత్వం వైద్యసేవలు అందిస్తుందని బాధితులు కోలుకుంటున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే క్షతగాత్రుల కుటంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన ఎండీఎం నిర్వాహకరాలు రాధను సీఐటీయూ నాయకులు పరామర్శించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో

మందస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భారతీసౌజన్య సూచించారు. మందస మేజరు పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి శ్రీకాకుళం జిల్లా రూ.29 కోట్లు ఇంటి పన్ను డిమాండ్‌కు గాను 2శాతం మాత్రమే వసూలైందని, దీన్ని శతశాతం లక్ష్యాలు చేరుకోవాలన్నారు. మందసలో శానిటేషన్ పనులు పరిశీలించారు. ఆమె వెంట డివిజనల్ పంచాయతీ అధికారి ఐవీ రమణ, ఎంపీడీవో వై.వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎ.తిరుమలకుమార్, ఈవో నవీన్‌కుమార్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పలాసరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఏపీఎన్‌జీవో సమావేశంలో సభ్యులు కోరారు. రెంటికోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, సచివాలయంలో ఉద్యోగులతో శుక్రవారం ఏపీఎన్‌జీవోల సమావేశం నిర్వహించారు. ఆ సంఘ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలు, ప్రభుత్వం నిర్దేశించే పనులు చేస్తూ ఉన్నారని, ఇదే సమయంలో ఉద్యోగల సమస్యల పరిష్కారంలో పాలకులు దృష్టి సారించాలన్నారు. సంఘ బలోపేతం చేసేందుకు ఏపీఎన్‌జీవోఎస్ ఎన్నికల్లో ఉద్యోగులందూరు పాల్గొనాలన్నారు. అనంతరం నూతనంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి రఘురామ్, పంచాయతీ సెక్రటరీ సద్గుణరావు, సీహెచ్‌వో ఆదమ్మ, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, పద్మావతి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

దేశభక్తి భావాలు పెంపొందించాలి


ధ్రువ పత్రాలతో విద్యార్థులు

పాతపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుండే దేశభక్తి భావాలు పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. స్థానిక అమరజ్యోతి స్కూల్‌లో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించిన కోర్సులో మొదటి స్థాయి (ప్రవేశిక)అర్హత పొందిన విద్యార్థులకు ధ్రువ పత్రాలను సీఐ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.సోమేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఇప్పిలి మురళీకృష్ణ బోధనాసిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం


గిరిజనులకు మందులు అందిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే గిరిజనులకు పూర్తిస్థాయిలో నాణ్యమైన వైద్యం అందుతుందని మాజీ ఎంపీపీ బైరిసింగి లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం బందపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గిరిజన గ్రామానికి సరైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రహదారులకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇంటింటికి వైద్యసేవలు పేరుతో గిరిజనులను మోసగించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనపాన రాజశేఖరెడ్డి, ఎం.శ్రీధర్, బి.ధరణి, వైద్యులు బాలగ శిరిషా, రవితేజ, సురేష్, దేవి తదితరులు ఉన్నారు.

సక్రమంగా వైద్య సేవలందించాలి

ఎల్ఎన్ పేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్ర జలకు 104 ద్వారా సక్రమంగా వైద్య సేవలు అందించాలని భవ్య ఏజెన్సీ డివిజనల్ అధి కారి కె.దినేష్‌కుమార్ తెలిపారు. వాడవలస గ్రామంలో వైద్యసేవలందిస్తున్న 104 వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన తనిఖీచేశారు. 104 సిబ్బంది విధులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. వైద్యసిబ్బంది అందిస్తున్న సేవలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. డీఈవో హరి, పైలట్ నర్సింగరావు ఉన్నారు.

పక్కాగా ఈ-పంట నమోదు చేయాలి

పలాసరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట నమోదు కచ్చితంగా రైతులు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ ఎస్.రామారావు అన్నారు. శుక్రవారం రెంటికోట, అమలకుడియా గ్రామాల్లో ఈ-పంట నమోదు చేపట్టారు. పండించిన ధాన్యం ప్రభుత్వానికి విక్రయించాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. పంటల బీమా వర్తించేందుకు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 25లోగా పంట నమోదు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సీజేపై దాడికి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేయాలి

జలుమూరు (సారవకోట), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఎ.సంతోష్‌కుమార్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం శుక్రవారం అందించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సంఘ ప్రతినిధులు యర్రయ్య, సూర్య, సతీష్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పోలాకి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నరసన్నపేట ఐసీడీఎస్ పీవో శోభారాణి సూచించారు. జాతీయ బాలికా వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం గంగివలస కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయంలో ఐసీడీఎస్‌తో కలిసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుతోపాటు ఆరోగ్యంపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖన, కుర్చీ, డాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వారం రోజులుగా పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించామని ఐసీడీఎస్ పీవో తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ సంక్షేమాధికారి జి.శారద, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంశధార రిజర్వాయర్‌లో 21 కిలోల చేప



హిరమండలం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): హిరమండలం వద్ద వంశధార రిజర్వాయర్‌లో శుక్రవారం మత్స్యకారులు చేపలు పడుతుండగా భారీ చేప (బొచ్చు) వారి వలకు చిక్కింది. దీని బరువు 21 కిలోలు ఉన్నట్టు మత్స్యకారులు తెలిపారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గోపికృష్ణ మాట్లాడుతూ.. ఇటువంటి చేపలు సహజంగా ఆరు నుంచి ఏడు కిలోల వరకు పెరుగుతాయని, 21 కిలోల వరకు పెరగడం చాలా అరుదుగా జరుగుంటాయని తెలిపారు.

శ్రీముఖలింగంలో గ్రామోత్సవం

జలుమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా అర్చకులు నిర్వహించారు. ఆశ్వయుజమాసం బహుళ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి దర్శనం భక్తులకు కల్పించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, ఎస్.వెంకటాచలం, అచ్యుత, శ్రీకృష్ణ, శివ, యోగి దేవాదాయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

మెళియాపుట్టి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలుకు మంజూరైన రహదార్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ డీఈ చందునాయుడు తెలిపారు. శుక్రవారం పవరకుడ్డబ రహదారి పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అనుకున్నా సమయానికి రహదారి పనులు పూర్తి చేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు చేయాలన్నారు. మళ్లీ వర్షాలు పడితే రాయిపిండి కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందు వల్ల పనులను ప్రారభించాలపి తెలిపారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు అనపాన రాజశేఖరెడ్డి, బి.ధరణి, ఏఈ ఆనందరావు, తదితరులు ఉన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

నందిగాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వరిలో ప్రస్తుతం వ్యాపిస్తున్న తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి వ్యవసాయశాఖ ఏడీ జగన్మోహనరావు తెలిపారు. శుక్రవారం పెద్దతామరాపల్లిలో పంట పోలాలను పరిశీలించారు. సాంబ, సొర్ల రకాలకు సుడిదోమ తెగులు వ్యాపిస్తున్నాయని, దీన్ని నివారణకు హెచ్‌పెట్ మందు పిచికారీ చేయాలన్నారు. పరిశీలనలో ఏవో శ్రీకాంత్‌వర్మ, వీఏఏ సోని తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలి

పాతపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సర్వీస్‌రూల్స్ అమలుతో ఉద్యోగుల హక్కుల పరిరక్షణ జరుగుతుందని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తమ్మినేని చందనరావు తెలిపారు. మండలంలోని పలు స్కూళ్లను శుక్రవారం సందర్శించి సభ్యత్వ నమోదు చేపట్టారు. అలాగే ఆయా ఉపాధ్యాయుల స్కూళ్ల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రోణంకి మోహనరావు, జిల్లాకార్యదర్శి డకర శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పొందాలి

పాతపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ సీపీఆర్(కార్డియో పల్మనరీ రిసస్సిటే షన్)పై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి గిడుతూరి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి పర్యటన

నరసన్నపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శనివారం సారవకోట, జలుమూరు, నరసన్నపేట మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ఆయన ప్రారంభించనున్నట్టు పార్టీ కార్యాలయ ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సారవకోట మండలంలో ఉదయం 9 గంటలకు రూ.50 లక్షలతో నిర్మించిన నవరమాలువ నుంచి మాలువ వరకు నిర్మించిన సీసీ రోడ్డు, 10 గంటలకు నవరకురిడింగిలో రూ.65లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు, 10.30 గంటలకు కిడిమి రోడ్డు నుంచి పద్మాపురం వరకు రూ.2కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, 12గంటలకు రూ.40లక్షలతో నిర్మాణం చేసిన కుమ్మరిగుంట సచివాలయ భవనం, 3గంటలకు వడ్డినవలస-కొమనాపల్లి రోడ్డు నుంచి తర్లి వరకు నిర్మించిన సీసీ రోడ్డు, 4 గంటలకు జలుమూరు మండలం అల్లాడ గ్రామం వద్ద రూ.3.20 కోట్లు నిర్మాణం చేసిన ఎల్‌కే రోడ్డు, 4.30 గంటలకు పారశెల్లి గ్రామంలో సీసీ రోడ్డు, అలాగే పారశెల్లిలో చిల్డ్రన్ పార్కు, బస్‌షెల్టర్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

డేటా సెంటర్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు


కుత్తుమ లక్ష్మణరావు

పలాసరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశలు మెరుగుపడతాయని, ఇది ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుమ లక్ష్మణకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గూగుల్ సెంటర్ ఏర్పాటులో యువనేత లోకేష్ కృషి ఎనలేనిదన్నారు. ఈ సెంటరు రాకతో ఈ ప్రాంతంలో సాంకేతికతలో విద్యను అభ్యసించిన యువతకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని, ఆ దిశగా ప్రభుత్వం భవిష్యత్తు ఆలోచనతో మన ప్రాంతంలో నెలకొల్పడం కూటమి ప్రభుత్వం ముందుచూపునకు నిదర్శనమన్నారు. 2020 విజన్‌తో సీఎంగా చంద్రబాబు మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పి అభివృద్ధి చేశారన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

పలాస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉండే శివాజీనగర్ రెండో వీధికి సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు వారు మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబును కలిసి వినతి పత్రం అందించారు. మట్టిరోడ్డుపై అనేక ఏళ్లుగా మార్గంగా ఏర్పాటు చేసుకొని ఇబ్బందులు పడుతున్నామని, ఇటీవల కురిసిన వర్షాలకు రెండు అడుగుల లోతు నీటిలో ప్రయాణించాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి నిర్మిస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని, దీనిపై స్పందించాలని కోరారు. దీనిపై చైర్మన్ డీఈఈ కనకరాజుతో మాట్లాడి తక్షణం టెండర్లు పిలవాలని ఆదేశించారు.

ఆరుబయట చెత్త వేయొద్దు

పలాస రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చెత్తను ఆరుబయట పడవేయకుండా చెత్తబండికి అందజేయాలని, చెత్తసేకరణకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు అన్నారు. దానగొర గ్రామంలో చెత్తసేకరణపై కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేసి చెత్తసేకరణపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఐవీఆర్ఎస్ కాల్స్, చెత్త సేకరణపై గ్రామప్రజలు చైతన్యవంతులు కావాలని, తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా అందించడం ద్వారా చెత్తకేంద్రాలకు వాటిని తరలించి చెత్తద్వారా సంపద సృష్టించవచ్చునని ప్రజలకు తెలియజేశారు.

ఏఎంసీ చైర్మన్‌కి అభినందన

కోటబొమ్మాళి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషును తన కార్యాలయంలో శుక్రవారం కోటబొమ్మాళి రైస్ మిల్లుల యజమానులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో రైస్ మిల్లులకు రావాల్సిన ధాన్యం తదితర అంశాల గూర్చి రైస్‌మిల్లుల యజమానులు ఆయనతో చర్చించారు. సమావేశంలో రైస్ మిల్లుల సంఘం అధ్యక్షుడు సకలాభక్తుల లక్ష్మణరావు, కొత్తమ్మతల్లి ఆలయ చైర్మన్ కోరాడ గోవిందరావు, బోయిన శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

పలాసరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని మాజీ మంత్రి అప్పలరాజు అన్నారు. రంగోయి గ్రామంలో శుక్రవారం రచ్చబండ, సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు దువ్వాడ రవి, జిల్లా కార్యదర్శి బి.హేమేశ్వరరావు, అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన పాల్గొన్నారు.